



మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 108 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | వెల : 2-00


# తిరుపతిలో హైడ్రామా



- గోశాలపై గోల
- ప్రదర్శనగా బయలుదేరిన భూమన
- నేతలు మాత్రమే రావాలన్న పోలీసులు
- రోడ్డుపై పడుకుని భూమన నిరసన
- 'నిర్బంధం' అంటూ హడావుడి
- పోలీసుల నిబంధనలు పాటిస్తూ
- గోశాలకు వెళ్లిన కూటమి నేతలు
- తమలాగే రావాలని భూమనకు ఫోన్
- మళ్లీ బల ప్రదర్శనకు వైసీపీ ప్రయత్నం

**స్వర్ణసాగరం తిరుపతి**

టీటీడీ గోశాలలో ఆవుల మృతిపై అటు వైసీపీ, ఇటు కూటమి నేతల మధ్య 'సవాళ్లపర్వం' నడిచింది. దీనిపై గురువారం తిరుపతిలో హైడ్రామా నెలకొంది. పోలీసుల సూచన మేరకు కూటమి నేతలు మాత్రమే గోశాల సందర్శనకు వెళ్లగా... టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మందీ మార్బలంతో ప్రదర్శనగా బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఎస్వీ గోశాలలో వందకు పైగా గోవులు చనిపోయాయంటూ భూమన ఆరోపించడంతో... గోశాలకు వచ్చి చూడాలంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సవాల్ విసిరారు. దీనికి స్పందించిన భూమన తాను గురువారం వస్తానని ప్రకటించగా, దీనిని కూటమి నేతలు స్వాగతించారు. అయితే... 'ఒకేసారి రెండు పార్టీల నేతలు గోశాలకు వెళ్లకూడదు. మందీమార్బలంతో కాకుండా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, వ్యక్తిగత భద్రతా సిబ్బందితో మాత్రమే రావాలి' అని తిరుపతి ఎస్పీ హర్షవర్ధనరాజు స్పష్టం చేశారు. కూటమి, వైసీపీ నేతలకు ఇవే నిబంధనలు వర్తిస్తాయని ప్రకటించారు. అధికార పార్టీ నేతలు దీనిని పాటించగా, మందీమార్బలంతో బయలుదేరిన వైసీపీ నేతలు హైడ్రామా నడిపించారు.

**భారీ ప్రదర్శనగా...**

గురువారం ఉదయం వైసీపీ ఎంపీ గురుమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో భూమన నివాసానికి చేరుకున్నారు. వారందరితో కలిసి భూమన ప్రదర్శనగా ఎస్వీ గోశాలకు బయలుదేరారు. ఇంతమందిని అనుమతించేది లేదని పోలీసులు అడ్డుకున్నారు. గోశాలలోకి ప్రవేశాన్ని అడ్డుకోబోమని, అయితే ఐదుగురు, వారి వ్యక్తిగత గన్‌మెన్‌కు మాత్రమే అనుమతి ఉందని ముందస్తుగా జారీ చేసిన ఆదేశాలను గుర్తుచేశారు. గోశాల వద్దకు గుంపులుగా రావద్దని విజ్ఞప్తి చేశారు. అయితే, తమను గోశాలకు - మిగతా 3లో




# వర్గీకరణకు జై డీఎస్సీకి సై

- ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ 20 లేదా 23న నోటిఫికేషన్?
- అమల్లోకి వచ్చిన వర్గీకరణ
- కేబినెట్ తీర్మానించిన రెండు రోజుల్లోనే గవర్నర్ ఆమోద ముద్ర
- డీఎస్సీ నోటిఫికేషన్‌కు మార్గం సుగమం
- 16,347 టీచరు పోస్టుల భర్తీకి శ్రీకారం
- నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజులకు పరీక్షలు
- వయోపరిమితిలోనూ అభ్యర్థులకు ఊరట
- 42 నుంచి 44 ఏళ్లకు పెంపు
- స్పెషల్ ఎడ్యుకేషన్ కింద 2,260 పోస్టులకు విడిగా విడుదల కానున్న ప్రకటన




## కే2-18బీ గ్రహంపై జీవం ఆనవాళ్లు

- కనుగొన్న భారత సంతతి శాస్త్రవేత్త
- జీవానికి మూలమైన కణజాలం ఆ గ్రహంపై ఉన్నట్లు గుర్తించారు
- మన సౌర కుటుంబానికి ఆవల ఉన్న కే2-18బీ గ్రహంపై.. జీవం ఆనవాళ్లు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. భూమి మీద చిన్న చిన్న జీవాలు ఉత్పత్తి చేసే కణాలకు చెందిన సిగ్నల్స్ ఆ గ్రహంపై గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తమ స్టడీలో పేర్కొన్నారు.

## నడ్డా వారసుడి కోసం కసరత్తు

- జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ముందు కీలక రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించాలి
- ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల రాష్ట్ర అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్నారు.
- ఇప్పటికే అనేక రాష్ట్రాలకు అధ్యక్షులు ప్రకటించినప్పటికీ సగానికి పైగా రాష్ట్రాల అధ్యక్ష ఎన్నికలు పూర్తయితే తప్ప జాతీయ అధ్యక్షుడి ఎన్నిక సాధ్యం కాదు
- సామాజిక సమీకరణాలు, సీనియారిటీ సమర్థత, ఆర్ఎస్ఎస్ అండదండలు ఉండే నేతకు జాతీయ అధ్యక్షుడు అయ్యే అవకాశాలున్నాయి.



## వక్ఫ్ ఆస్తుల్లో ఎలాంటి మార్పు చేయొద్దు

- సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- "వక్ఫ్ బోర్డులో నూతన నియామకాలు చేయొద్దు
- వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించొద్దు
- వక్ఫ్, వక్ఫ్ బై యూజర్ ఆస్తులను డీ నోటిఫై చేయొద్దు వక్ఫ్ ఆస్తులు, నియామకాలపై స్టేటస్ కో విధిస్తున్నాం
- పిటిషనర్లు లేవనెత్తిన అంశాలకు వారం రోజుల్లో సవివర రిప్లై దాఖలు చేయాలి.






## మెహుల్ చోక్సీని భారత్‌కు తరలించేందుకు బెల్జియంతో సంప్రదింపులు జరుపుతున్నాం

- తమ అభ్యర్థన మేరకే అక్కడి పోలీసులు అరెస్టు చేశారు
- రూ.13,500 కోట్ల బ్యాంకు రుణం మోసం కేసును దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి
- చోక్సీ అప్పగింతపై విదేశాంగశాఖ చర్చలు జరిపింది
- బెల్జియంతో భారత్ సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడి
- విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్

# మా కూటమి ప్రభుత్వానికి సహకరించండి



- బియ్యం పంపిణీలో లోపాలుంటే 1967కు ఫిర్యాదు చేయండి
- దీపం-2 పథకానికి రూ.2,684 కోట్లు కేటాయింపు
- ఆయిల్ కంపెనీ ప్రతినిధుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్
- బ్యాంకర్స్ కు మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపు
- మంత్రి నాదెండ్ల అధ్యక్షత బ్యాంకర్స్ తో సమావేశం
- రేషన్ కోసం ప్రజలు ప్రతి నెలా ఎదురుచూస్తున్నారని వెల్లడి
- రేషన్ అవసరమైన ప్రజలకు, రైతులకు బ్యాంకర్లు అండగా ఉండాలని విజ్ఞప్తి

**స్వర్ణసాగరం అమరావతి**

పౌరసరఫరాల శాఖ పరిధిలో బియ్యం పంపిణీ, దీపం పథకం కింద ఉచిత సిలిండర్ డబ్బు, ధాన్యం కొనుగోళ్లలో మోసాలు తదితర వాటిపై ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1967 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ సూచించారు. గురువారం ఆయన విజయవాడలోని సివిల్ సప్లై భవన్ లో ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలో భాగంగా ప్రతి ఆడబిడ్డకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించాలన్న వాగ్దానాన్ని కూటమి ప్రభుత్వం నిజం చేస్తోందని తెలిపారు. మార్చి 31న బుక్ చేసుకున్న లబ్ధిదారులకు ఏప్రిల్ నెలలో సిలిండర్ డెలివరీ అయిన తరువాత సబ్సిడీ జమలో సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయాన్ని ఆయిల్ కంపెనీలు మంత్రి దష్టికి తీసుకువచ్చాయి. దీనిపై మంత్రి సానుకూలంగా - మిగతా 3లో



## చెప్పేవి గొప్ప మాటలు.. చేసేది మాత్రం శూన్యం

- 'రాష్ట్ర ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన లేదు
- పెట్టుబడులో రావాలంటే మేమే అని అంటారు.
- ప్రభుత్వ ఉద్దేశంలో పరిశ్రమలను ప్రోత్సాహించడం అంటే పొగపెట్టడమే
- కడపలో యాష్ కోసం కూటమి నేతల గొడవలు ప్రజలు చూశారు.
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత బొత్స సత్యనారాయణ.

**స్వర్ణసాగరం విశాఖ**

ఏపీ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందో లేదో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత బొత్స సత్యనారాయణ. ప్రభుత్వ పెద్దలు చెప్పేవి గొప్ప మాటలని, చేసేది మాత్రం శూన్యమన్నారు బొత్స. 'రాష్ట్ర ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన లేదు. పెట్టుబడులో రావాలంటే మేమే అని అంటారు. ప్రభుత్వ ఉద్దేశంలో పరిశ్రమలను ప్రోత్సాహించడం అంటే పొగపెట్టడమే. కడపలో యాష్ కోసం కూటమి నేతల గొడవలు ప్రజలు చూశారు. ఇదొక్కటే కాదు.. కృష్ణపట్నం పోర్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల విషయంలో ఇదే జరిగింది. - మిగతా 3లో

# నడ్డా వారసుడి కోసం కసరత్తు



**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీకి నూతన జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ముందు కీలక రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించాల్సి ఉంది ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల రాష్ట్ర అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలకు అధ్యక్షులు ప్రకటించినప్పటికీ సగానికి పైగా రాష్ట్రాల అధ్యక్ష ఎన్నికలు పూర్తయితే తప్ప జాతీయ అధ్యక్షుడి ఎన్నిక సాధ్యం కాదు. సామాజిక సమీకరణాలు, సీనియారిటీ సమర్థత, ఆర్‌ఎస్‌ఎస్ అండదండలు ఉండే నేతకు జాతీయ అధ్యక్షుడు అయ్యే అవకాశాలున్నాయి. నూతన అధ్యక్షుడి ఎంపిక పార్టీ సంస్థాగత నిర్మాణానికి కొత్త దిశను ఇవ్వడంతోపాటు రాబోయే శాసనసభ ఎన్నికల వ్యూహంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. దక్షిణాదిలో ప్రధానంగా తెలంగాణ, కర్ణాటకలో సొంతంగా పాగా వేయాలని చూస్తున్న అధిష్ఠానం ఆచితూచి అధ్యక్ష ఎంపికపై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర నాయకత్వం నుంచి వచ్చిన సలహాలు సూచనలు ,రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణాల ఆధారంగా రాష్ట్ర అధ్యక్షులు ఎంపిక ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తిచేయనుంది.నూతన జాతీయ అధ్యక్షుడు ఎన్నిక తర్వాత పార్టీలో సంస్థాగత మార్పులు, ఎన్నికల వ్యూహాలపై పెద్ద ప్రభావం చూపవచ్చు. అధ్యక్షుడి ఎన్నిక జనవరిలో జరగాల్సి ఉండగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఏప్రిల్ సగం గడిచినప్పటికీ ఇంకా ఎన్నిక జరగలేదు. అధ్యక్షుడి ఎంపికలో సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే నాయకుడికి ప్రాధాన్యత ఇస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నూతన అధ్యక్షుడు వచ్చిన తర్వాత 50 శాతం జాతీయ ప్రధాన కార్యదర్శులను తొలగించే అవకాశం ఉందని సమాచారం. దీంతో పాటు, కొత్త అధ్యక్షుడి బృందంలో యువ నాయకులకు ప్రధాన కార్యదర్శులుగా అవకాశం ఇవ్వవచ్చు. అదే సమయంలో, ప్రభుత్వం నుంచి కొంతమంది నాయకులను పార్టీ సంస్థాగత వ్యవహారాల్లోకి తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ప్రస్తుతం పలువురు నాయకుల పేర్లు రేసులో ఉన్నాయి. ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, బండి సంజయ్ కుమార్, రఘునందన్ రావు, రామచంద్రరావు, డీకే అరుణ, మురళీధర్ రావు, పాయల శంకర్, చింతల రామచంద్రా రెడ్డి సహా పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జి.కిషన్ రెడ్డి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉండగా కేంద్ర మంత్రిగా బిజీగా ఉండటం వల్ల రాష్ట్రంలో పార్టీని నడిపించేందుకు కొత్త నాయకుడి అవసరం ఉందని పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. ఇప్పటికే అధ్యక్షుడి ఎంపికపై బీజేపీ అధిష్ఠానం పరిశీలకులతో అభిప్రాయాలని సేకరించింది. నాయకుల మధ్య అంతర్గత పోటీ, ఫిర్యాదుల వల్ల ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. అధిష్టానం ఒకరిని అధ్యక్షుడిగా నిర్ణయించి మెజారిటీ జిల్లా అధ్యక్షులు చేత నామినేట్ చేయించి నామినేషన్ ప్రక్రియ పూర్తి చేసి అధికారికంగా అధ్యక్షుడు ప్రకటన పూర్తి చేస్తుంది. అధ్యక్ష పదవి ఎంపిక తెలంగాణలో బీజేపీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల వ్యూహానికి కీలకం. అధిష్ఠానం ఈ విషయంలో రెండు మూడు రోజుల్లో స్పష్టతనిచ్చే అవకాశం ఉంది.బీసీ సామాజికవర్గం.. తెలంగాణాలో పాపులారిటీ.. సహా రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టాలంటే ఈటలరకు అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రేసులో ఉన్న నేతలు సైతం ఈటల రాజేందర్‌కు అధ్యక్ష బాధ్యతలు ఇస్తే తమకు అభ్యంతరం లేదని అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. ఇప్పటికే అనేక సందర్భాల్లో పక్క పార్టీల నుంచి వచ్చిన వారిని అధ్యక్షులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల తమిళనాడు అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. పక్కన ఉన్న ఏపీలో పురంధేశ్వరి, కన్నా లక్ష్మీ నారాయణలను అధ్యక్ష పీఠం ఎక్కించిన సందర్భాలున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సైతం ఎవరిని అధ్యక్షుడు చేసినా తనకు అభ్యంతరం లేదని చెప్పినట్లు సమాచారం.ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రంలో మంత్రివర్గంలో స్థానం రాకపోవడంతో ప్రస్తుతం ఉన్న పురంధేశ్వరిని మరోసారి కొనసాగించే అవకాశం ఉంది. పురంధేశ్వరి స్థానంలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు పలువురు నేతలు రేసులో ఉన్నారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, ఎమ్మెల్యేలు పార్థ సారథి, సుజనా చౌదరి ముందు వరుసలో ఉన్నారు. సామాజిక సమీకరణాలు పార్టీ బలోపేతం లక్ష్యంగా ఏపీ బీజేపీ అధ్యక్ష ఎన్నిక ఉండబోతున్నట్లు తెలుస్తోంది

# వక్ఫ్ ఆస్తుల్లో ఎలాంటి మార్పు చేయొద్దు



**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ చట్టం 2025పై దేశసర్వోన్నత న్యాయస్థానం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వక్ఫ్‌పై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం వారం గడువు కోరగా.. న్యాయస్థానం అందుకు అంగీకరించింది. వక్ఫ్ ఆస్తులు, నియామకాలపై సుప్రీంకోర్టు స్టేటస్ కో విధిస్తూ తదుపరి విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది. వక్ఫ్ (సవరణ) చట్టం 2025ను సవాల్ చేస్తూ 73 పిటిషన్లు నమోదు కాగా.. గురువారం వరుసగా రెండో రోజూ సుప్రీం కోర్టు వాదనలు వింది. కొన్ని అంశాలతో ప్రాథమిక సమాధానం ఇవ్వడానికి కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వారం గడువు కోరారు. తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని తెలిపారు. ఈ క్రమంలో.. వక్ఫ్ ఆస్తుల్లో ఎలాంటి మార్పు చేయొద్దని సీజేఐ నేతృత్వంలోని బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. "వక్ఫ్ బోర్డులో నూతన నియామకాలు చేయొద్దు. వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను సభ్యులుగా నియమించొద్దు. వక్ఫ్, వక్ఫ్ బై యూజర్ ఆస్తులను డీ నోటిఫై చేయొద్దు వక్ఫ్ ఆస్తులు, నియామకాలపై స్టేటస్ కో విధిస్తున్నాం. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలకు వారం రోజుల్లో సవివర రిప్లై దాఖలు చేయాలి. మరో ఐదు రోజుల్లో రిజైండర్ దాఖలు చేయాలి" అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది.

గత విచారణలో(బుధవారం).. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు

వక్ఫ్ సవరణ చట్టం మత స్వేచ్ఛ హక్కుకు భంగం కలిగిస్తుంది

ఇది రాజ్యాంగ విరుద్ధమైన చట్టం

వక్ఫ్ అంటే ఇస్లాం కు అంకితమైంది

కేంద్రప్రభుత్వం తరఫు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు

జేపీసీ ద్వారా సంపూర్ణంగా అన్ని వర్గాలతో చర్చలు జరిపాము

వక్ఫ్ అనేది కేవలం చారిటీకి సంబంధించినది మాత్రమే

హిందూ ధార్మిక సంస్థలను కూడా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి

హిందూయేతర అధికారులు హిందూ ధార్మిక సంస్థలను నిర్వహిస్తున్నారు

వక్ఫ్ బై యూజర్ ద్వారానే అనేక మసీదులను ఏర్పాటు చేశారు

రిజిస్టర్ చేసుకోవడంలో మసీదులకున్న అభ్యంతరం ఏమిటి

**సుప్రీంకోర్టు సీజేఐ వ్యాఖ్యలు**

సుదీర్ఘకాలంగా ముస్లిం కార్యక్రమాలకు వాడుతున్న (వక్ఫ్ బై యూజర్) ఆస్తులను డినోటిఫై చేస్తే అనేక సమస్యలు తలెత్తుతాయి వక్ఫ్ బై యూజర్ ఆస్తులను రిజిస్టర్ చేయడం కష్టం..అయితే ఇది దుర్వినియోగమైంది అయితే నిజంగా ముస్లిం ధార్మిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న ఆస్తులు కూడా ఉన్నాయి

హిందువుల ఆస్తులను హిందువులే నిర్వహిస్తున్నారు కదా

పార్లమెంటుకు చట్టాలు చేసే అధికారం లేదా ?

హిందువుల కోసం కూడా పార్లమెంట్ చట్టాలు చేస్తుంది కదా

ఢిల్లీ హైకోర్టు కూడా వక్ఫ్ భూమి లోనే ఉందని అంటున్నారు

చారిత్రక , పురావస్తు ఆస్తులను వక్ఫ్ గా ప్రకటించడానికి వీలు లేదు

కాసేపట్లో వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టులో విచారణ

**వక్ఫ్ పిటిషన్లపై విచారణ వేళ.. హైలైట్స్**

అంతకు ముందు.. వక్ఫ్ పిటిషన్ల విచారణను లైవ్ టెలికాస్ట్ కోరుతూ సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ లేఖ రాసింది. బుధవారం విచారణ టైంలో కిక్కిరిసిపోయిన కోర్టు హాల్‌లో కనీసం నిలబడటానికి కూడా స్థలం సరిపోలేదని, ఊపిరి ఆడక ఇద్దరు లాయర్లు స్పృహ కోల్పోయారని లేఖలో ప్రస్తావించింది.

**సుప్రీంకోర్టు మార్గదర్శకాలపై ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ హర్షం**

హైదరాబాద్: వక్ఫ్ (సవరణ) బిల్లుపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలపై ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు వైఖరి దేశవ్యాప్తంగా ముస్లింలకు ఊరట కలిగించిందన్నారు. న్యాయ వ్యవస్థపై విశ్వాసం మరింత బలోపేతం చేసిందన్నారు. వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంలో జరిగిన పరిణామాలను స్వాగతిస్తున్నామన్నారు.

అధికారంలోకి రాగానే వక్ఫ్ చట్టాన్ని అడ్డుకుంటాం. బీహార్‌ను వక్ఫ్ అల్లర్లతో మరో బెంగాల్(ముర్షిదాబాద్)గా మార్చాలని వాళ్లు(కేంద్రంలోని బీజేపీ) అనుకుంటున్నారు. ఆర్జేడీ నాయకత్వంలో అది అయ్యే పని కాదు అని తేజస్వి యాదవ్ అన్నారు. వక్ఫ్ చట్టం దేశ ప్రజల మధ్య ఐక్యతను క్రమంగా తుడిచిపెట్టేందుకేనని కేంద్రంలోని ఎన్డీయే సర్కారు వక్ఫ్ సవరణ చట్టం తెచ్చిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపించారు. ఇది ఫెడరలిజాన్ని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను ఉల్లంఘించడమేనని అన్నారాయన. రాజ్యాంగ విరుద్ధమైన ఈ చర్య ద్వారా.. ఆరెస్సెస్, బీజేపీలు వక్ఫ్ చట్టం ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నాయని విమర్శించారు.

**ఇండియా కూటమి.. కలిసి పోరాడుదాం**

రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టం అడ్డుకునేందుకు ప్రతిపక్ష కూటమి ఇండియా కలిసి రావాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పిలుపు ఇచ్చారు. సొంత దేశంలో ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వం.. సౌదీ అరేబియా, దుబాయ్ లాంటి పశ్చిమ ఆసియా దేశాల నుంచి ఆతిథ్యం మాత్రం స్వీకరిస్తున్నారని మండిపడ్డారు. ఏకతాటిపైకి వచ్చి వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి పార్టీలు పోరాడాలని ఆమె అంటున్నారు.

# మెహుల్ చోక్సీని భారత్‌కు తరలించేందుకు బెల్జియంతో సంప్రదింపులు జరుపుతున్నాం

పారిపోయిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ అరెస్టుపై విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది. తమ అభ్యర్థన మేరకే అక్కడి పోలీసులు అరెస్టు చేశారని విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఇందులో భాగంగా భారత్ నుంచి పారిపోయిన చోక్సీ కోసం దర్యాప్తు సంస్థలు భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. అప్పగింత విషయంలో బెల్జియంతో కలిసి పని చేస్తున్నట్లు తెలిపారు. రూ.13,500 కోట్ల బ్యాంకు రుణం మోసం కేసును దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. చోక్సీ అప్పగింతపై విదేశాంగశాఖ చర్చలు జరిపిందని.. బెల్జియంతో భారత్ సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. మరో వైపు 26/11 ముంబయి ఉగ్రదాడి నిందితుడు తహవ్వూర్ రాణాను భారత్‌కు అప్పగించే విషయంపై ఓ ప్రశ్నకు స్పందిస్తూ.. పాకిస్తాన్ ఎంత ప్రయత్నించినా.. ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రమే ఖ్యాతి తగ్గదన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమవుతారని.. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక సమస్యలపై చర్చిస్తారన్నారు. అమెరికా సుంకాలపై మాట్లాడుతూ.. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్చలు జరుపుతున్నామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి రష్యా నుంచి ఆహ్వానం అందిందని.. విక్టరీ డే వేడుకల్లో భాగస్వామ్యాన్ని ప్రకటించనున్నట్లు తెలిపారు. మరో వైపు కైలాస్ మానస సరోవర్ యాత్ర గురించి మాట్లాడుతూ.. యాత్ర విషయంలోనే త్వరలో ప్రకటన జారీ చేస్తామని.. త్వరలోనే తిరిగి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. భారత్–చైనా మధ్య ప్రత్యక్ష విమాన సేవలపై మాట్లాడుతూ.. సూత్రప్రాయంగా విమాన కార్యకలాపాలు ప్రారంభమవుతాయని.. ఇందుకు రెండు దేశాలు అంగీకరించినట్లు తెలిపారు. ఇరువైపులా సాంకేతిక ఏర్పాట్లపై పౌర విమానాయాన అధికారులతో సమావేశం జరిగిందని.. ఫ్రేమ్‌వర్క్‌తో సహా సంబంధిత పద్ధతులపై చర్చిస్తున్నట్లు తెలిపారు. ఇక వక్ఫ్ సవరణ చట్టంపై ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బిల్లులో అని అంశాలు భారత్ అంతర్గత విషయమన్నారు. క్వాడ్ భవిష్యత్




ఉజ్వలంగా ఉందని.. త్వరలోనే క్వాడ్ శిఖరాగ్ర సమావేశం తేదీలను ప్రకటిస్తారన్నారు. యూఎస్–ఇరాన్ చర్చలను సానుకూల పరిణామంగా తెలిపారు. భారత్–బంగ్లాదేశ్ సంబంధాలపై మాట్లాడుతూ బంగ్లాతో భారత్ సానుకూల, నిర్మాణాత్మక సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలని భావిస్తుందన్నారు. వాణిజ్య సమస్యల విషయానికి వస్తే.. గత వారం ట్రాన్స్‌షిప్‌మెంట్ సౌకర్యంపై ప్రకటించామన్నారు.

## సుప్రీం కోర్టు 'గడువు'పై ఉపరాష్ట్రపతి హాట్ కామెంట్స్



**న్యూఢిల్లీ:** శాసనసభలు ఆమోదించిన బిల్లులను ఆమోదించడం లేదంటే తిప్పి పంపే విషయంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ ఇటీవల సుప్రీం కోర్టు గడువు విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ హాట్ హాట్ కామెంట్స్ చేశారు. న్యాయస్థానాలు రాష్ట్రపతిని నిర్దేశించే పరిస్థితి ఉండకూడదంటూ వ్యాఖ్యలు చేశారాయన. రాజ్యసభ ఇంటర్న్స్ 6వ బ్యాచ్‌ను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన.. న్యాయస్థానాలు రాష్ట్రపతిని నిర్దేశించే పరిస్థితి ఉండకూడదన్నారు. అదే జరిగితే రాజ్యాంగంలోకి ఆర్టికల్ 142 కింద సుప్రీం కోర్టు తనకున్న ప్రత్యేక అధికారాలను.. ప్రజాస్వామ్య శక్తులపై ఒక అణ్వాయుధాన్నే ప్రయోగించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. సుప్రీం కోర్టు నిర్దిష్ట సందర్భాల్లో ఈ అధికారాన్ని విస్తృతంగా ఉపయోగించడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం పడుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారాయన. తమిళనాడు పెండింగ్ బిల్లుల వ్యవహారంపై ?జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ నేతృత్వంలోని ధర్మాసనం సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవికుమార్ తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్న సర్వోన్నత న్యాయస్థానం.. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని తన తీర్పులో స్పష్టం చేసింది. ఈ తీర్పు వెలువడిన తర్వాత తమిళనాడు ప్రభుత్వం 10 పెండింగ్ బిల్లుల్ని చట్టాలుగా ప్రకటించింది. అయితే అటుపై రాష్ట్రపతి పరిశీలన కోసం గవర్నర్లు పంపే బిల్లులను ఉద్దేశించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలే చేసింది. గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గవర్నర్ పంపిన బిల్లులను రాష్ట్రపతి ఎటూ తేల్చకపోతే అప్పుడు రాష్ట్రాలు నేరుగా తమను ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు చెప్పడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ తీర్పుపై కేంద్రం ప్రభుత్వం సమీక్షకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఇదే వేదిక నుంచి.. ఢిల్లీ హైకోర్టు జడ్జి బంగ్లాలో నోట్ల కట్టలు బయటపడిన వ్యవహారంపైనా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ స్పందించారు. ఘటన జరిగి నెలరోజులు గడుస్తున్నా.. ఎఫ్ఐఆర్ లేకపోవడం, దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేకపోవడం, జడ్జిలకు కలిగే ఉపశమనం గురించీ ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## టిడిపి మీడియో కోఆర్డినేటర్‌గా నాగమల్లి దుర్గాప్రసాద్



**స్వర్ణసాగరం శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ మీడియా కోఆర్డి నేటర్‌గా మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్‌ను నియమించారు. ఆ మేరకు ఎమ్మెల్యే బొజ్జల వెంక ట సుధీర్‌రెడ్డి ప్రకటించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో చర్చించి నియామకాన్ని ఖరారు చేశారు. మీడియాకు సంబంధించిన వ్యవ హారాలను చూసుకునేలా బాధ్యతలు అప్పగించారు. సౌమ్యుడు, వివాదారహితుడు తెలుగు యువత పట్టణ అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం నేపథ్యం లో మీడియాతో కలిగిన సన్నిహిత సంబంధాలు ఈ పదవి రావడానికి కారణమైంది. మీడియా కోఆర్డి నేటర్‌గా ఎన్నికైన దుర్గాప్రసాద్‌ను ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సత్కరించారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఎమ్మె ల్యే కార్యక్రమానికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తానని తెలిపారు. అలాగే విలేకరుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పాత్రికేయల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే అప్పగించిన ఈ బాధ్యతలను అంకితభావంతో సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

## చలివేంద్రం ప్రారంభించిన.. బొజ్జల రిషితా రెడ్డి.



**స్వర్ణసాగరం- శ్రీకాళహస్తి**

శ్రీకాళహస్తి పట్టణంలోని 28 వార్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పేటశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం అక్కడకు వచ్చిన మహిళలకు, వేసవి తాపం తీర్చడానికి మజ్జిగ, నీరు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పేట శేఖర్‌ను అభినందించారు. ప్రతి ఒక్కరు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ కంఠ రమేష్, టిడిపి సీనియర్ నాయకులు శ్రీకాళహస్తి నియోజకవర్గం గౌడ సంఘ అధ్యక్షులు అంతటి రమేష్‌బాబు గౌడ్, 28వ ఇంచార్జ్ భాస్కర్ గౌడ్, మహిళ అధ్యక్షురాలు సుమతి, నాయకులు వివేక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమ్మినేని వెంకట్ జన్మదిన వేడుకలు

**మార్టూరు స్వర్ణసాగరం, ఏప్రిల్ 17:**



గురువారం మార్టూరు కోరిగుంట్ల గవర్నమెంట్ హాస్పటల్ పక్క రోడ్డు లోని వెంకయ్య ఆశ్రమంలో అన్నదా నం చేయువారు హైదరాబాద్ వాస్త వ్యులు మార్టూరు నివాసులు కొమ్మి నేని. వెంకట్ (పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిఏ ) పుట్టినరోజు సందర్భంగా భార్య కరుణశ్రీ, కుమారుడు కొమ్మినేని. కార్తికేయ సాయి మరియు ప్రేమతో మీ తమ్ముళ్లు మరియు కుటుంబ సభ్యులు ఆశ్రమం లో అన్నదానం చేశారు స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ అధ్యక్షుడు తన్నీరు శివ రాజేష్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు కొమ్మినేని వెంకట్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుపతిలో హైడ్రామా





-మొదటిపేజీ తరువాయి

వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారంటూ తన ఇంటి ముందే నేతలు, శ్రేణులతో కలిసి భూమన రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. 'మీ సవాల్‌కు స్పందించి నేను గోశాలకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి చెప్పారు.
గోశాలకు రమ్మని భూమనకు సవాల్ విసిరి.. చివరకు ఆయన వెళ్లే సమయానికి అడ్డుకుంటారా అంటూ రోజా తదితరులు విమర్శించారు. పలువురు నేతలు రాజకీయ ఆరోపణలు చేశారు. ఈ విధంగా 45 నిమిషాలకుపైగా నిరసన కొనసాగించారు. భూమనను హౌస్ అరెస్టు చేశారంటూ వైసీపీ శ్రేణులు హంగామా సృష్టించాయి. ఈ ప్రచారాన్ని పోలీసులు ఖండించారు. తాము ఎవరినీ నిర్బంధించలేదని... గోశాలకు ప్రదర్శనగా వెళ్లేందుకు మాత్రమే నిరాకరించామని స్పష్టం చేశారు.

**గోశాలకు వెళ్లిన కూటమి నేతలు**

మరోవైపు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు(తిరుపతి), పులివర్తి నాని (చంద్రగిరి), బొజ్జల సుధీర్ రెడ్డి(శ్రీకాళహస్తి), మురళీకృష్ణ (పూతలపట్టు), థామస్ (గంగాధర నెల్లూరు), గురజాల జగన్మోహన్ (చిత్తూరు)తోపాటు టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన, బీజేపీ నేతలు ఉదయం 9.10గంటలకు గోశాల చేరుకున్నారు. ఆవులను పరిశీలించి, అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. వీరు గోశాలలో ఉన్నంతసేపూ పోలీసు యంత్రాంగం వెన్నంటే ఉంది. గోశాల నుంచే ఎమ్మెల్యేలు నాని, సుధీర్ రెడ్డి భూమనకు ఫోన్‌చేసి ఆహ్వానించారు. అసత్య ఆరోపణలు చేసి ఇంట్లో ఉండటం కాదని, గోశాలకు రావాలని కోరారు. అప్పటికే నిరసన నుంచి ఇంట్లోకి వెళ్లిన భూమన.. మళ్లీ భారీగా శ్రేణులతో కలిసి బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. టీడీపీ నేతల చాలెంజ్‌పై తాను స్పందించానని, వారు అక్కడ ఉన్నప్పుడే తనను అనుమతించాలని భూమన పోలీసులను కోరారు. మధ్యాహ్నం 1.26గంటలకు కూటమి ఎమ్మెల్యేలు, నేతలు గోశాల సందర్శన పూర్తి చేసుకుని బయటకు వచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, భూమన సవాల్‌ను స్వీకరించి తాము వచ్చామని, గోశాలపై వైసీపీ నేతల ఆరోపణలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నాయని విమర్శించారు. అసత్య ఆరోపణలు మానుకోవాలని, వైసీపీ హయాంలో టీటీడీలో ఎన్నో అక్రమాలు జరిగాయని నేతలు ఆరోపించారు.

**గోడ దూకి వచ్చా: ఎంపీ గురుమూర్తి**

ఇదిలా ఉంటే తిరుపతి వైసీపీ ఎంపీ గురుమూర్తి మాత్రం గోశాలకు చేరుకున్నారు. గోశాలకు రాకుండా కరుణాకర్ రెడ్డిని అడ్డుకున్నారని, తాను వేరేదారిలో గోడదూకి రావాల్సి వచ్చిందని ఎంపీ చెప్పారు. కారులో నేరుగా గోశాలకు వచ్చి గోడదూకి వచ్చానని చెప్పడమేంటని కూటమి ఎమ్మెల్యేలు నిలదీయడంతో ఆయన నీళ్లు నమిలారు. గోడ దూకి రావడం అంటే ప్రధాన గేటు నుంచి కాకుండా వేరే గేటు నుంచి వచ్చానని సమర్థించుకున్నారు. మీతోపాటు ఒక వైసీపీ కార్పొరేటరు కూడా దర్జాగా గోశాలకు వచ్చినప్పుడు కరుణాకర్ రెడ్డి రావడానికి అడ్డంకులు ఏమిటని కూటమి నేతలు నిలదీశారు. ఈ క్రమంలో వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో ఎస్పీ జోక్యం చేసుకుని ఎంపీని అక్కడినుంచి పంపేశారు. తర్వాత కొద్దిసేపటికి కూటమి ఎమ్మెల్యేలు కూడా వెళ్లిపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

**పోలీసులు అనుమతించలేదు: భూమన**

గోశాలకు తనను పోలీసు అధికారులు అనుమతించలేదని మీడియా సమావేశంలో భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. తనను అర్ధరాత్రి నుంచి పోలీసులు గృహ నిర్బంధం చేశారని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ మించిపోయింది లేదని రేపు, ఎల్లుండి ఎప్పుడు రమ్మన్నా కేవలం ఐదుగురితోనే వస్తామని, గోశాలలో పుట్టి పెట్టిన గోవులను చూపెడతామని భూమన పేర్కొన్నారు.

# వర్గీకరణకు జై డీఎస్సీకి సై

**అమరావతి**

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేసింది. దీనిపై ఆర్డినెన్స్ జారీ అయింది. ఎస్సీ కులాలను మూడు కేటగిరీలుగా విభజిస్తూ, దానికి అనుగుణంగా రిజర్వేషన్లను పంచే 'వర్గీకరణ'పై గురువారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఇది వెంటనే అమలులోకి వచ్చినట్లుగా ప్రకటించారు. దీంతో... మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి మార్గం సుగమమైంది. ఈనెల 20 లేదా 23వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చేందుకు వీలుగా కసరత్తు జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఆర్డినెన్స్ ముసాయిదాకు రాష్ట్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. దీనిపై త్వరలోనే ఆర్డినెన్స్ జారీ చేస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. దీనిని వెంటనే గవర్నర్ ఆమోదానికి పంపింది. గురువారమే గవర్నర్ దీనిపై ఆమోద ముద్ర వేశారు. 'ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కులాల ఉప వర్గీకరణ ఆర్డినెన్స్ – 2025 జారీ చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు లేనందున, వర్గీకరణను వెంటనే అమలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడినందున ఆర్డినెన్స్ జారీచేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీని ప్రకారం గ్రూప్–1 కేటగిరీకి చెందిన రెల్లి, 12 ఉపకులాలకు ఒక శాతం... గ్రూప్–2కు చెందిన మాదిగ, 18 ఉప కులాలకు 6.5 శాతం... గ్రూపు–3కు చెందిన మాల, 29 ఉప కులాలకు 7.5 శాతం చొప్పున, మొత్తం 15 శాతం రిజర్వేషన్ కేటాయిస్తారు. మూడు ఎస్సీ గ్రూపుల విషయంలో 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని అవలంబిస్తారు. ఈ విధానాన్ని ఒక్కొక్కటి 1 నుంచి 100 సంఖ్యతో రెండు సైకిల్స్ అమలు చేయాలి. ఆర్డినెన్స్ జారీ నేపథ్యంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ గురువారం సచివాలయానికి వచ్చి సీఎస్ విజయానంద్‌కు ?కృతజ్ఞతలు తెలియజేశారు.
డీఎస్సీకి రెడీ.. నిరుద్యోగులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి వర్గీకరణ ఆర్డినెన్స్‌తో లైన్‌క్లియర్ అయ్యింది. నోటిఫికేషన్ ప్రకటించేందుకు పాఠశాల విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. మొత్తం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీకి శ్రీకారం చుడతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోనుంది. డీఎస్సీపై సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీచేసిన వెంటనే నోటిఫికేషన్ జారీచేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 20 లేదా 23 మంచి రోజులు కావడంతో... ఆ తేదీల్లోనే నోటిఫికేషన్ జారీచేయాలని భావిస్తున్నారు.
నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజుల తర్వాత పరీక్షలు జరుగుతాయి. గతంలోనే జిల్లాలవారీగా పోస్టుల వివరాలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. కాగా ఇటీవల సృష్టించిన 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను మరో ప్రత్యేక డీఎస్సీతో భర్తీ చేస్తారు. విద్యా సంవత్సరం



ప్రారంభంనాటికి ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

వయోపరిమితి పెంపు

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిని సడలిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత గరిష్ఠ వయోపరిమితి ప్రస్తుతం 42ఏళ్లుకాగా దానిని అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు 44ఏళ్లకు పెంచారు. 2024 జూలై 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు. ఈ సడలింపు ఈ ఒక్క డీఎస్సీకి మాత్రమే వరిస్తుందని స్పష్టంచేశారు

# నెలకు మద్యం దందా 60 కోట్లపైనే

**నెల్లూరు :** మద్యం కుంభకోణంలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు రాజ్ కసిరెడ్డి. ఈ మొత్తం ఎపిసోడ్లో ఆయనే కర్త,కర్మ,క్రియ. ఈ కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం ముమ్మరంగా వేటాడుతోంది. విచారణ కోసం పిలిచినా ఆయన లెక్క చేయలేదు. నోటీసులు ఇచ్చిన స్పందించలేదు. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు ఆయన ఇల్లు, కార్యాలయాలు, సన్నిహితులు, స్నేహితుల ఇళ్లల్లో సోదాలు చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్ చేరుకున్న 50 మంది ఏపీ పోలీసులు తెలంగాణ పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టారు. లిక్కర్ కింగ్ పిన్ గా ఉన్న రాజ్ కసిరెడ్డి అరెస్టు లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.అయితే ఈ దర్యాప్తు బృందానికి నేతృత్వం వహిస్తున్నారు ఏఎస్పీ భూషణం . అయితే ఈ దర్యాప్తులో నమ్మలేని నిజాలు బయటకు వస్తున్నాయి. రాజ్ కసిరెడ్డి సినిమా వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేందుకు బినామీ పేర్లతో ఈడి క్రియేషన్స్ అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఇప్పటికే పలు సినిమాల నిర్మాణంలో భాగస్వామిగా కూడా ఉన్నారని గుర్తించారు దర్యాప్తు బృందం అధికారులు. మరిన్ని కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ఒప్పందాలు చేసుకుంటున్న తరుణంలోనే మద్యం స్కాం బయటపడినట్లు తెలుస్తోంది. అదేవిధంగా రియల్ ఎస్టేట్, పవర్ ప్లాంట్స్ లోను వాటాలు పెట్టారని చెబుతున్నారు. కసిరెడ్డి కూతురు ఇషాని పేరుతో ఓన్రాను సమస్తను సైతం నెలకొల్పారని పోలీసులు చెబుతున్నారు. హైదరాబాదులోని పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా వాటాలు పెట్టారని? బ్లాక్ మనీని వైట్ గా మార్చేశారని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.వాస్తవానికి రాజ్ కసిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుడు. ఆయనకు మద్యం కుంభకోణంతో సంబంధం ఎలా అన్నది ఇప్పుడు ప్రశ్న. పేరుకే ఐటి సలహాదారుడు కానీ.. ఆయన ఎక్కువగా మద్యం వ్యాపారాన్ని పర్యవేక్షించాలని ఫిర్యాదులు ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రంగా మరోవైసీపీ నేతతో కలిసి ఆయన ఈ దందా నడిపినట్లు సమాచారం. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఏ రోజు ఏ బ్రాండ్ అమ్మాలనేది రాజ్ కసిరెడ్డి డిసైడ్ చేసేవారని.. తమకు ముడుపులు ఇచ్చిన కంపెనీలకి ఆర్డర్లు ఇచ్చేవారని.. ఇందుకోసం కేసుకు 150. ఇలా ప్రతినెల కమీషన్ల రూపంలో 60 కోట్ల రూపాయలు వసూలు చేసేవారని పోలీస్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. వైసిపి పాలనలో నాలుగేళ్ల ఎనిమిది నెలల పాటు ఈ దందా కొనసాగిందని.. వేల కోట్ల రూపాయలు అక్రమంగా కూడేసారని రాజ్ కసిరెడ్డి పై ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం రాజ్ కసిరెడ్డి కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం హైదరాబాదులో జల్లెడ పడుతోంది. ఆయన అవినీతిపరుడు అంటూ పత్రికల్లో కథనాలు వచ్చిన రాజ్ కసిరెడ్డి ఎంతవరకు స్పందించలేదు. ప్రస్తుతం ఆయన హైదరాబాదులోనే ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కొద్దిరోజుల కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ



మాజీ నేత విజయసాయిరెడ్డి మద్యం స్కాం విషయంలో సంచలన ఆరోపణలు చేశారు. రాజ్ కసిరెడ్డి సూత్రధారి అని తేల్చేశారు. ఇప్పుడు రాజ్ కసిరెడ్డి దందాలు ఒక్కొక్కటి బయటకు వెలుగులోకి వస్తుండడం గమనార్హం.

## మా కూటమి ప్రభుత్వానికి సహకరించండి

-మొదటిపేజీ తరువాయి

స్పందిస్తూ, అట్టి లబ్ధిదారుల ఖాతాల్లో సబ్సిడీని వెంటనే జమ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే దీపం%–%2 పథకం పై ప్రజల్లో మరింత అవగాహన పెంచేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఇప్పటి వరకు 99.22 లక్షల మంది లబ్ధిదారులు మొదటి ఉచిత సిలిండర్ ను ఉపయోగించారని మంత్రి వెల్లడించారు. దీపం%–%2 పథకానికి ప్రభుత్వం రూ.2,684 కోట్లు కేటాయించిన విషయం గుర్తుచేశారు. లబ్ధిదారులు సాధారణ పద్ధతిలో ముందుగా సిలిండర్ కు పూర్తి ధర చెల్లించి బుక్ చేయాలి. పట్టణాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో డెలివరీ జరుగుతుంది. అనంతరం 48 గంటలలోపు చెల్లించిన మొత్తం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలోకి తిరిగి జమ అవుతుంది. ఒక సంవత్సరం లో 3 ఉచిత సిలిండర్లను నాలుగు నెలల వ్యవధిలో బుక్ చేసుకునే అవకాశం కల్పించారన్నారు. ఖరీఫ్ మాసంలో ఆరు లక్షల మంది రైతుల నుంచి 38 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. ధాన్యం కొనుగోలు జరిగిన 24 గంటల్లో రైతుల ఖాతాలో నగదు జమ కావడంతో వారు ఆనందంగా ఉన్నారన్నారు. అదేవిధంగా రేషన్ పక్కదారి పట్టకుండా రేషన్ మాఫియాపై ఉక్కు పాదం మోపడం జరిగిందని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. నూతన సాంకేతిక విధానంతో కొత్త రేషన్ కార్డులు అందించబోతున్నామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించి ప్రతి వేర్ హౌస్ గోడౌన్ వద్ద ఏఐ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నామని, కాబట్టి బ్యాంకర్స్ వడ్డీ రేటు తగ్గించుకొని ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.
సమావేశంలో సివిల్ సప్లై కమిషనర్ సౌరభ్ గౌర్, ఎండి మనజీర్ జిలానీ, నాబార్డ్ జీఎం కె వి వి ప్రసాద్డ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం తుసర్ , యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం హనుమంతరావు , ఇండియన్ బ్యాంక్ ఏజీఎం రామ్మూర్తి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పంజాబ్ బ్యాంకు, యూకో బ్యాంక్, కెనరా బ్యాంక్ , ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఆప్కా ప్రతినిధులు ఉన్నారు

## 'చెప్పేవి గొప్ప మాటలు.. చేసేది మాత్రం శూన్యం'

-మొదటిపేజీ తరువాయి



ఎచ్చెర్ల లిక్కర్ ఫ్యాక్టరీ వద్ద కూడా కూటమి నేతలు డబ్బులు వసూలు చేశారు. జిందాల్ పరిశ్రమపై కేసులు పెట్టి వేదిస్తే ఆ కంపెనీ గుజరాత్ కు వెళ్ళిపోయింది. పరిశ్రమలను ఇబ్బంది పెట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పరిస్థితి ఇలా ఉంటే పరిశ్రమలు ఎలా వస్తాయి. విద్యుత్ చార్జీలు పెంచి ఆ నెపాన్ని వైఎస్సార్ సీపీ నేతలపై నెడుతున్నారు. మిర్చి రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం చెప్పింది. ఒక్క టన్ను మిర్చి అయినా ప్రభుత్వం కొన్నదా?, రాష్ట్రంలో ఏ రైతుకి ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇస్తున్నారు..? , పొగాకు రైతులకు ఏమైనా మేలు చేశారా..? , ఒకవైపు పరిశ్రమలు ఇబ్బంది పడుతున్నాయి.. మరోవైపు కార్మికులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి హామీ కూలీలకు డబ్బులు చెల్లించడం లేదు. ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్, దౌర్జన్యాలు చేస్తుంది. అధికారాన్ని అడ్డు పెట్టుకొని జులుం చేస్తుంది. ఈ ప్రభుత్వ అలసత్వం, నిర్వాకం వలన రాబోయే తరానికి ముప్పు వాటిల్లుతుంది. ఇంత అప్పు గతంలో ఎప్పుడూ లేదు.. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇంత అప్పులు లేవు. ఏ శాఖలో కూడా జవాబుదారీ తనం లేదు.
ఏ మంత్రి అయినా నా శాఖలో ఇంత కచ్చితత్వం ఉందని ఎవరైనా చెప్పగలరా..? , కొత్త పెన్షన్లు రాష్ట్రంలో ఒక్కటి కూడా ఇవ్వలేదు. పేద పిల్లల చదువులకు ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా లేదు. విద్య, వైద్యం రాష్ట్రంలో లేవు. ఏ శాఖలో కూడా నిర్దిష్టమైన విధానం లేదు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి ఈరోజుకి కూడా అలానే ఉంధి. ప్రభుత్వం అసలు ఆలోచన కూడా చెయ్యడం లేదు. సంవత్సరం సమయం ఇచ్చారు ఈ ప్రభుత్వానికి ఇంకేం కావాలి. ధీటుగా ఎదుర్కోవాలి అని చంద్రబాబు మంత్రులకు చెప్పారు. ఏముందని.. ఏం చేశారని ధీటుగా ఎదుర్కొంటారు. పరిశ్రమలను ఇబ్బంది పెడుతున్న వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. పెండింగ్ అర్జీ దారులకు ఎప్పుడు పెన్షన్ ఇస్తారు' అని బొత్స నిలదీశారు.

# ప్రతిపక్షాలకు లోకేష్.. మోడల్



**విజయవాడ**

రాజకీయాల్లో ఎత్తు పల్లాలు ఉంటాయి. గెలుపోటములు కూడా ఉంటాయి. ఇవన్నీ పార్టీలకు వర్తిస్తాయి. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో అందరికీ తెలిసిందే. 2014 వరకు ఆ పార్టీ హవా నడిచింది. అటు తరువాత బిజెపి శకం ప్రారంభం అయింది. వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ. అయితే ఇప్పటికీ బీజేపీ హవా నడుస్తూనే ఉంది. అయితే ఇది ఎల్లకాలం ఉంటుందని చెప్పలేం. మొన్నటి వరకు తెలంగాణలో అధికారంలో ఉంది బిఆర్ఎస్. కానీ సార్వత్రిక ఎన్నికల్లో బోణీ కొట్టలేకపోయింది. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని బలంతో ఉండేది. కానీ మొన్నటి ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అంతెందుకు మొన్నటి వరకు ఫెయిల్యూర్ నాయకుడిగా ఉన్నారు నారా లోకేష్. అటువంటి నేత ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో యువ నేతలకు ఇన్స్పైర్ చేసే విధంగా మారారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. ఇబ్బందులను అధిగమించి నిలబడగలిగారు.ఒకప్పుడు లోకేష్ ఒక నాయకుడేనా అనే పరిస్థితి ఉండేది. ఆయన సమర్థతపై అందరిలోనూ అపనమ్మకం ఉండేది. సొంత పార్టీ నేతలే అనుమానించేలా ఉండేది. రాజకీయ ప్రత్యర్థులు అయితే అవమానాలతో రెచ్చిపోయేవారు. కానీ ఇప్పుడు ఆయన పరిస్థితి మారింది. తాను ఒక నాయకుడిగా నిరూపించుకు న్నారు. పాలకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఓ పార్టీ భావి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకునే పనిలో ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే లోకేష్ కు మైనస్ లు కంటే ప్లస్ లే ఎక్కువగా ఉంటున్నాయి.తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత ఇప్పుడు నారా లోకేష్ ను ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ. అందుకే ఇప్పుడు ఆ పార్టీని బలోపేతం చేయడానికి కుటుంబ సభ్యులంతా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో కవిత ఇటీవల సంచలన ప్రకటనలు చేస్తున్నారు. పింక్ బుక్ రాసుకుంటున్నానని.. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే అందరి లెక్కలు తేల్చుతానని హెచ్చరిస్తున్నారు. తాను తన తండ్రి కెసిఆర్ మాదిరిగా మంచి దానిని కాదని.. తాను ఒక రౌడీ అని చెబుతున్నారు. అచ్చం 2024 ఎన్నికల కు ముందు నారా లోకేష్ చెప్పిన మాదిరిగానే కవిత కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా కవిత చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. లోకేష్ కు కాపీ కొడుతున్నారు అని కామెంట్స్ వినిపిస్తున్నాయి.2019లో అధికారంలోకి వచ్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అంతులేని విజయంతో ఆ పార్టీ టిడిపి అంతు చూడాలని భావించింది. కేసులతో భయపెట్టింది. అరెస్టులతో ఉక్కు పాదం మోపింది. ఆ సమయంలోనే నారా లోకేష్ పాదయాత్ర చేశారు. రెడ్ బుక్ అంటూ కొత్త ప్రకటన చేశారు. అన్ని ఆ బుక్ లో రాసుకుంటున్నానని.. తప్పకుండా దీనిపై చర్యలు ఉంటాయని చెప్పారు. చెప్పిన మాదిరిగానే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను టార్గెట్ చేస్తున్నారు. తనదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. గతంలో టిడిపి విషయంలో తప్పులు చేసిన ఏ వైసీపీ నేతను విడిచి పెట్టడం లేదు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండే వారికి లోకేష్ ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే కవిత తీవ్రస్థాయిలో లోకేష్ మాదిరిగా హెచ్చరికలు పంపారు. తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ అవుతోంది.

మాటకలం - ప్రాముఖ్యత బలం RNI No : APTEL/2020/15905
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# పాటూరులో ఫైలేరియా కిట్ పంపిణీ, అవగాహన కార్యక్రమం

**కోవూరు, స్వర్ణ సాగరం, ఏప్రిల్ 17:**

నెల్లూరు జిల్లా కోవూరు మండలం పాటూరు గ్రామంలో ఈరోజు ఫైలేరియా (బోదకాలు) నివారణకు సంబంధించిన ఎంఎం డీపీ కిట్‌ను పంపిణీ చేశారు. పాటూరుకు విచ్చేసిన పచ్చిపాల వెంకట సుబ్బారెడ్డి అనే లబ్ధిదారునికి ఈ కిట్‌ను అందజేయడంతో పాటు, రెండు కాళ్ళను ఏ విధంగా శుభ్రం చేసుకోవాలో వైద్య సిబ్బంది వివరించారు.ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్ యూ ఒ నాగరాజు, ఎం ఎల్ హెచ్ పి రాజేష్, ఏ ఎన్ ఎం అనురాధ, మరియు ఆశా కార్యకర్త మమత పాల్గొన్నారు. ఫైలేరియా వ్యాధి నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ కిట్ల పంపిణీ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించ బడింది.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ, ఫైలేరియా దోమకాటు ద్వారా వ్యాప్తిస్తుందని, వ్యాధి ముదిరితే కాళ్ళు, చేతులు వంటి భాగాలు వాపుకు గురై వికృతంగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఎంఎండీపీ కిట్‌లోని మందులు క్రమం తప్పకుండా వాడాలని, అలాగే కాళ్ళను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని వారు సూచించారు.లబ్ధిదారుడు వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ, తనకు ఈ కిట్ అందించినందుకు మరియు వ్యాధి గురించి అవగాహన కల్పించినందుకు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం పాటూరు గ్రామ ప్రజలలో ఫైలేరియా వ్యాధిపై అవగాహన పెంచడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానికులు భావిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని వారు కోరుతున్నారు.



# 3.69 లక్షల ఎకరాల్లో రెండో పంటకు నీళ్లు ఐఏబి సమావేశంలో నిర్ణయం

**నెల్లూరు స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**

3.69 లక్షల ఎకరాలలో రెండో పంటకు నీటి సరఫరా అందిస్తున్నట్టు గురువారం నిర్వహించిన ఐ ఏ బి సమా వేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన జరిగిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కావ్య కృష్ణారెడ్డి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కాకర్ల సురేష్ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి సాగునీటి సంఘాల ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు. సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో 147 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాలు గల ఏకైక జిల్లా నెల్లూరు అని తెలిపారు సోమశిల కండలేరు జలాశయాల్లో కలిపి ప్రస్తుతం 100 టీఎంసీల జలాలు అందుబాటులో ఉన్నాయన్నాం .3.69లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు ప్రతిపాదించినట్లు వివరించారు. రెండో పంట మూడు లక్షల ఎకరాలకు మించి సాగు చేయాలని అదనంగా సాగు చేసి నా నీఌ ఌ అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పెన్నార్ డెల్టా పరిధిలో సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి 90000 ఎకరాలకు నీరు ఇవ్వాలనిఅధికారులు ప్రతిపాదించారన్నారుమొదటి పంటలో పండించిన ధాన్యం విక్రయాల విషయంలో రైతులకు ఇబ్బంది లేకుండా ప్రజాప్రతినిధులు అందరూ కలిసి కృషి చేసినట్లు తెలిపారులస్కర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు



# షేక్ నజ్మాను అభినందించి రూ.10,000/- పారితోషికం అందించిన వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**

కనిగిరి మున్సిపాలిటీకి చెందిన షేక్ మహమ్మద్ కుమార్తే షేక్ నజ్మా కనిగిరి విజేత జూనియర్ కాలేజీలో సీనియర్ ఇంటర్ బైపిసి నందు 989/1000 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ మరియు రాష్ట్ర స్థాయి లో 3వ ర్యాంక్ సాధించిన సందర్భంగా కనిగిరి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ స్థానిక పార్టీ కార్యాలయం లో ఆ విద్యార్థిని అభినందించి మిఠాయి తినిపించారు.అనంతరం ఘనంగా సన్మానించి రూ.10 వేలు పారితోషికం అందించారు.ఈ సందర్భంగా ఇంచార్జి దద్దాల నారాయణ మాట్లాడుతూ ఇలాగే కృషి, పట్టుదలతో మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ కటికల వెంకటరత్నం,సర్పంచ్ సైకం ఏడుకొండలు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు..

# సాయిబాబా కు ప్రత్యేక పూజలు

**మందిర నిర్మాణ కర్తలు ఉచ్చూరు హరనాథ్ రెడ్డి, శోభారాణి దంపతులు**

**350 మంది భక్తులకు అన్నదానం**

**స్వర్ణ సాగరం ఓజిలి ఏప్రిల్ 17:**



మండల పరిధిలోని మానమాల సాయిబాబా మందిరంలో మందిర నిర్మాణ కర్తలు ఉచ్చూరు హరనాథ్ రెడ్డి, శోభారాణి దంపతులు సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాగడ హారతి సాయినాథుని మేల్కొల్పి కాకఢా హారతి తో పూజలను ప్రారంభించారు. ఆలయ నిర్మాణకర్తలు కట్టా విష్ణువర్ధన్ రెడ్డి, సాయి సుజన రెడ్డి గోత్రనామాలపై పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సాయిబాబా కు అభిషేకాలు హారతులు ఇచ్చి విఘ్నేశ్వర స్వామి, దత్తాత్రేయ స్వామి, శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయినాథుని పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 300 మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. సాయంత్రం ధూప్ హారతి తో సాయినాథునికి పూజలు చేశారు. రాత్రి పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సేజ్ హారతి నిర్వహించి భక్తులకు సాయిబాబా దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



**స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్**

శ్రీకాళహస్తి రూరల్ మండలం ఓబులాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆరవ తరగతి ప్రవేశం కొరకు జిల్లా పరిషత్ ఓబులాయిపల్లి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎర్రం రెడ్డి పల్లి రెడ్డిపల్లి ఓబులాయిపల్లి గిరిజన గ్రామాల్లో పర్యటించి విద్యార్థులను తల్లిదండ్రులను కలిసి ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు ఇంటింటా ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాధిక్ భాష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఉచిత మధ్యాహ్న భోజన పథకం ఉచితంగా పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ స్కాలర్షిప్లు అందిస్తున్నారని నాణ్యమైన విద్య కొరకు ప్రభుత్వ పాఠశాలలోనే ప్రవేశం పొంది ఉన్నత విద్యలు అభ్యసించాలని తల్లిదండ్రులను విద్యార్థులను కోరారు ఎర్రమరెడ్డిపల్లి రెడ్డిపల్లి ఓబులాయిపల్లి గిరిజన కాలనీల నుండి ప్రాథమిక పాఠశాల విద్యార్థులను సుమారు 15 మంది విద్యార్థులను ఉన్నత పాఠశాలలో ప్రవేశం కొరకు తీసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీ కాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నా

# విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే మురళీమోహన్



**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఏప్రిల్ 17**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని ఉషోదయ ప్రాంగణం లోని విజయవాడ శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ఇండియన్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి వారు సాధించిన ట్యాబ్ గోల్డ్ మెడల్ మరియు సర్టిఫికెట్లను బహూకరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏ జి ఎం సురేష్,ఆర్ ఇ చక్రదర్, ప్రిన్సిపల్ కే సి ప్రతిమ, అకాడమీ దీని ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# జనసేన ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి



**ముత్తుకూరు సాగరం ఏప్రిల్ 17**

మండల కేంద్రంలో గురువారం సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతిఉత్తమ ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సురేష్ నాయుడు మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి రాష్ట్రపతిగా ఎన్నో సేవలు అందించి భారతదేశ జ్ఞాన సంపదను ఇచ్చిన మహనీయునిగా కొనియాడారు. వారి పూర్వీకులు సర్వేపల్లి లో ఉండడం గర్వకారణమన్నారు ఆయన విగ్రహాన్ని త్వరలో సర్వేపల్లి లో ఏర్పాటు చేస్తామని సురేష్ నాయుడు తెలిపారు. బాల బాలికలు ప్రతి ఒక్కరూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకోవాలని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు ఈ కార్యక్రమంలో వెంకటాచలం మండలం ఏఎంసి డైరెక్టర్ గుమ్మినేని వాణి భవాని నాయుడు మండల కార్యదర్శి సందూరి శ్రీహరి ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం అశోక్ సుమన్ మస్తాన్ రెహమాన్ చిన్న కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# మంజునాథ్ మృతదేహానికి నివాళులు అర్పించిన వైస్సార్సీపీ మడకశిర సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలక్కప్ప



**అగళి స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**

అగళి మండలం మదూడి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు లక్ష్మమ్మ వీరభద్రప్ప కుమారుడు మంజునాథ్ కర్ణాటక రాష్ట్రం హాసన పట్టణంలో మను అనే వారి బేకరీ అంగడిలో పని చేసుకుంటూ ఉండేవాడు. అతను తన స్వగ్రామమైన మధుడి గ్రామానికి తిరిగి ప్రయాణిస్తూ వస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ నుండి కిందపడి మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకొని మడకశిర నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలక్కప్ప మృతుని స్వగ్రామమైన మదూడి గ్రామానికి స్థానిక నాయకులతో కలిసి వెళ్లి మృతదేహానికి పూలమాల సమర్పించి నివాళు లు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పడం జరిగినది. ఈ సందర్భంగా మీ కుటుంబానికి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా ఆదుకొంటుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బేకరీ ఓనర్ మను, స్థానిక సర్పంచ్ శివకుమార్, వైస్ ఎంపీపీ ఆరోగ్య స్వామి, చంద్రప్ప, సూర్యనారాయణ రెడ్డి, సీనప్ప తదితర వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులుభాస్కరరావు సేవలు అభినందనీయం

**నెల్లూరు స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**

నెల్లూరు నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కరరావు సేవలు అభినందనీయమని నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ అన్నారు. గురువారం భాస్కరరావు జరిగిన సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యున్నతమైన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రాష్ట్రపతి తోఅందుకోవడం నెల్లూరు కే గర్వ కారణం అన్నారు. గత 25 సంవత్సరాల నుంచి విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దిన ఆయన సేవలు మరచి పోలేనివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# సమతామూర్తుల ఆదర్శాలు నేటి యువతరానికి అవసరం

**చెన్నపల్లి పాలెం జడ్పీ హైస్కూల్లో జయంతి వేడుకలు**

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**



సమతామూర్తులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహాత్మా పూలే ఆదర్శాలు నేటి యువత ఆచరణలో పెట్టాలని గురువారం చెన్నపల్లి పాలెం జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సమతామూర్తుల సమావేశంలో ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆ మహనీయుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారి వారి సందేశాలలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మ పూలే జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# మడకశిర డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్లకార్డులతో నిరసన మరియు ధర్నా

మడకశిర, స్వర్ణసాగరం,ఏప్రిల్ 17

దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ కు చెందిన ఏపీఎస్ఆర్టీసీ డిపో ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది కోరారు. ఈ మేరకు ఎంఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక పావగడ రోడ్ సమీపంలోని ఆర్టిసి డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో యూనియన్ అధ్యక్షులు కె ముద్దప్ప ఉపాధ్యక్షులు పురుషోత్తం విలేకరులతో మాట్లాడారు. తమ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని 128 డిపోల ఎదుట ఎన్ఎంయు ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మడకశిర డిపో ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె ముద్దప్ప మాట్లాడుతూ...సర్కులర్ 1/ 2019 ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమ సస్పెన్షన్లను, ఉద్యోగుల తొలగింపులను ఆపాలని కోరారు. గత 4 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న పదోన్నతులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అపరిస్కృతంగా ఉన్న గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. వీటితో పాటు ఈహెచ్ఎస్ విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. జీవో – 114 ప్రకారం ఉద్యోగుల రాత్రి అలవెన్సులను రూ 150 నుంచి రూ 400 కు పెంచాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులను వెంటనే మంజూరు చేయాలని, అనారోగ్యానికి గురైన ఉద్యోగులు వినియోగించుకొనే సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. డిపో ఉపాధ్యక్షులు పురుషోత్తం మాట్లాడుతూ..ఆఫీసు సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఆన్ కాల్ డ్రైవర్లకు ఆర్టీసీ యాజమాన్యమే వేతనాలు చెల్లించాలన్నారు. అదే విధంగా ఎలక్ట్రిక్ బస్సులను ఏపీఎస్ఆర్టీసీ సంస్థ నిధులతోనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన సమస్యలను పరిష్కరించకుంటే తమ యూనియన్ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎమ్ యూ ఎ రీజనల్ మెంబర్ కరియప్ప, డిపో ట్రెజరర్ బి. ఎస్. నాయక్, డిపో ప్రెసిడెంట్ ముద్దప్ప, వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తం, అసిస్టెంట్ సెక్రెటరీ జయసింహ మరియు ఎస్ డి ఐ అజమత్ డ్రైవర్లు నాగరాజ్, పాపన్న, మల్లికార్జున్,షాజహాన్,కండక్టర్ సోము, గ్యారేజ్ బాబు, నరేష్,రసూల్, జియా, ఔట్సోర్సింగ్ డ్రైవర్ బాషా పాల్గొన్నారు.



## మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి.

### మండల కన్వీనర్ గణేష్



అమరాపురం స్వర్ణ సాగరం ఏప్రిల్ 17

అమరాపురం మండలంలో నేడు శుక్రవారం మండల పరిధిలోని శివారం గ్రామంలో విద్యుత్ సబ్స్టేషన్ ప్రారంభం చేస్తున్నందున మండల పరిధిలోని నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్ గొట్టిపాటి రవికుమార్, సవిత , సత్యకుమార్ లు ప్రారంభోత్సవానికి హాజరవుతున్నారన్నారు. అమరాపురం మండల మండలంలోని కె శివారం గ్రామంలో నూతనంగా ఏర్పాటైన 33/11కెవి సబ్ స్టేషన్ ను శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభిస్తారని అన్నారు. మడకశిర శాసనసభ్యులు టీటీడీ బోర్డు మెంబర్ ఎమ్.ఎస్. రాజు మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మండల కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జిలు, తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు ప్రతి ఒక్కరు జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని మనవి కోరారు.

## కరిడివారిపల్లిలో మధ్యాహ్న భోజనం తనిఖీ



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఏప్రిల్ 17

బంగారుపాళ్యం మండలపరిధిలోని కరిడి వారిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను బంగారుపాళ్యం మండల విద్యాశాఖ అధికారి పి నాగేశ్వరరావు సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడమైనది. భోజనము రుచికరంగా ఉన్నదని పిల్లలు తెలియజేసినారు వేసవి సెలవులకు విద్యార్థులకు సమ్మర్ లెర్నింగ్ యాక్టివిటీ ఇవ్వాలని, ఎన్రోల్మెంట్ పెంచడానికి తల్లిదండ్రులు ను కలవాలని ప్రధానోపాధ్యాయులు శేఖర్ తెలియజేయడమైనది

## పౌష్టికాహారం ను సద్వినియోగం చేసుకోవాలి



### సూపర్ వైజర్ ఆర్ సుజన

స్వర్ణ సాగరం ఓజిలి లి ఏప్రిల్ 17:

అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భవతులు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఆర్ సుజనా అన్నారు. మండల పరిధిలోని నెమళ్ళపూడి మెయిన్, ఎస్టి అంగన్వాడి కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు ప్రతినెల వైద్యుని సలహాలను తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గర్భవతి అయింది మొదలు పౌష్టికాహారమైన ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి ఆహారమును ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. బలమైన ఆహారం తీసుకుంటే జన్మించే శిశువు ఆరోగ్యంగా పుడతాడని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అగ్నిమాపక వారోత్సవాలు

### కే. విజయకుమార్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్

మడకశిర స్వర్ణ సాగరం ఏప్రిల్ 17




మడకశిర అగ్నిమాపక కేంద్ర పరిధిలో మడకశిర మండలం బుల్లసముద్రం గ్రామం నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఈ రోజు గురువారం అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా నాలుగవ రోజు వాహనము మరియు సిబ్బందితో వెళ్లి విద్యార్థులకు కరపత్రాలు పంచి అక్కడ అగ్నిమాపక వాహనముతో వివిధ అగ్ని ప్రమాదాలపై మంటలు ఆర్పే పద్ధతులను విద్యార్థులకు డెమో ద్వారా తెలియజేయడమైనది. ఈ అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా మడకశిర అగ్నిమాపక సిబ్బంది మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ మరియు ఉపాధ్యాయ బృందము పాల్గొనడం జరిగింది.

## కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు ఇవ్వండి




### తిరుపతిలోని కలెక్టర్ వారి కార్యాలయం నందు జరిగిన 16 ఫైనాన్స్ కమిషన్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం ఏప్రిల్ 17

తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో 16వ ఫైనాన్స్ కమిషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలోని 15 మంది మేయర్లు ,మున్సిపల్ చైర్మన్లతో స్థానిక సంస్థలు బలపడుటకు మరియు అభివృధి పై సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి కనిగిరి మున్సిపల్ చైర్మన్ ఆహ్వానం అందడంతో ఆయన తిరుపతిలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి సాధ్యమైనంత ఎక్కువ నిధులు మంజూరు చేయాలని కోరినారు.కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రతిపాదనలతో మంత్రి నారాయణ ద్వారా కనిగిరి మున్సిపల్ కార్యాలయ భవనమునకు రూ.6 కోట్లు, వెజిటబుల్ మార్కెట్ నిర్మాణమునకు రూ.3 కోట్లు, మటన్ మరియు ఫిష్ మార్కెట్ నిర్మాణమునకు రూ.3 కోట్లు , నూతన డ్రైనేజ్ కాలువల నిర్మాణమునకు రూ .4 కోట్లు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. పట్టణంలో నీటి సరఫరాకు జనరల్ ఫండ్ కాకుండా ప్రత్యేకంగా A.S.C. గ్రాంట్ విడుదల చేయాలని సమావేశానికి హాజరైన 16వ ఫైనాన్స్ కమిషన్ ఆఫ్ ఇండియా డాక్టర్ అరవింద పనగరియ ను కోరారు.ముందుగా రాష్ట్ర మున్సిపాలిటీల ప్రత్యేక కార్యదర్శి సురేష్ కుమార్ గారితో సమావేశం జరిగినది.

## కొండేపి జనసేన పార్టీ ఇంచార్జ్ మనోజ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసిన జనసేన థామస్



స్వర్ణ సాగరం కె వి బి పురం :

కొండేపి జనసేన పార్టీ ఇంచార్జ్ మనోజ్ కుమార్ తన స్వగృహమునందు కలిసిన జనసేన కేవిబీపురం మండల అధ్యక్షులు వి థామస్. జనసేన పార్టీ ని కొండేపి నియోజకవర్గం ప్రజలకు నిత్యం చైతన్య పరుస్తూ,ప్రజాసేవలో అనునిత్యం ప్రజాసేవకుడై మనోజ్ కుమార్ కి తమాపై నమ్మకం ఉంచి జనసేన ఇంచార్జ్గా నియమించినా అధినేత పవన్ కళ్యాణ్ అన్న అడుగు జాడల్లో నడుచే కొండేపి ఇంచార్జ్ మనోజ్ కుమార్ మరియు సత్యవేడు పి ఓ సీ ఇంచార్జ్ లావణ్య కుమార్, కార్యదర్శి హేమ కుమార్లకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ కేవిబీపురం మండల జనసేన పార్టీ మండల అధ్యక్షులు వి థామస్,జనసైనికులు సతీష్,సిద్దూ. విజయ్ కుమార్, రాజేష్,కిరణ్,నరేష్ చైత్యాన్య, రాజేష్,సురేష్ పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా పిల్లి వెంకటేశ్వర రెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం ఏప్రిల్ 17



ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం లోని పామూరు మండలంలో గల వగ్గంపల్లి గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వర రెడ్డి 2017 లో కాంగ్రెస్ పార్టీలో చేరగా సాధారణ కార్యకర్తగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వల్ల 2018 లో అప్పటి పిసిసి అధ్యక్షులు రఘువీరా రెడ్డి గారి నాయకత్వంలో మొదటగా కనిగిరి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పదవి వరించగా పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేయడంతో ఆ తదుపరి 2020 లో ఒంగోలు పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, 2022లో కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్త మరియు పిసిసి సభ్యులు గా పనిచేశారు. పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన నాకు ఇటీవల ప్రస్తుత పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి గారి నాయకత్వంలో ప్రకాశం జిల్లా అధ్యక్షులైన షేక్ సైదా అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ కమిటీలో జిల్లా ఉపాధ్యక్షులుగా అవకాశం కల్పించిన షర్మిల రెడ్డి మరియు సైదా కు అదే విధంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులైన మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ మరియు సోనియా గాంధీ లకు నా తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు నా శక్తివంచన లేకుండా అనునిత్యం పార్టీ పురోభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేస్తున్నాను.

## శ్రీసిటీ డైకిన్ ప్లాంట్ ను సందర్శించిన డైకిన్ ఇండస్ట్రీస్ గ్లోబల్ ప్రెసిడెంట్

### – శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ పట్ల ప్రశంస

శ్రీసిటీ,స్వర్ణ సాగరం ఏప్రిల్ 17, 2025:

డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నౌవుమీ టకేనాక గురువారం శ్రీసిటీలోని డైకిన్ ఇండియా తయారీ కేంద్రాన్ని సందర్శించారు. డైకిన్ ఇండియా ఛైర్మన్ %౭% మేనేజింగ్ డైరెక్టర్ కె.జె.జావా ఆయనకు ఆహ్వానం పలికారు. ప్లాంట్ పనితీరుపై సమీక్ష జరిపిన టకేనాక, ప్లాంట్ నిర్వహణ, సాంకేతిక నైపుణ్యం, దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళిక తదితర అంశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా టకేనాక, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కొద్దిసేపు సమావేశమయ్యారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్గా శ్రీసిటీ ఎదుగుదలను రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా టకేనాకకు వివరించారు. ముఖ్యంగా ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సుస్థిరత ద్వారా ఈ ప్రాంతం యొక్క పారిశ్రామిక వృద్ధికి డైకిన్ అందించిన గణనీయమైన సహకారాన్ని ఆయన ప్రశంసించారు.శ్రీసిటీ పెట్టుబడిదారుల అనుకూల పర్యావరణ వ్యవస్థను ప్రశంసించిన టకేనాక, పారిశ్రామికవాద స్థాయి, సామర్థ్యం, ఆధునిక మౌళిక సదుపాయాలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు శ్రీసిటీ బృందం అందిస్తున్న సహాయ సహకారాల పట్ల స్పందించిన ఆయన, శ్రీసిటీలో మరింత విస్తరించడానికి డైకిన్ ప్రణాళికలను కలిగివుందని చెప్పాడు. .పర్యటన పట్ల టకేనాకకు కృతజ్ఞతలు తెలిపిన డా. సన్నారెడ్డి, AC కంప్రెషర్లను ఉత్పత్తి చేయడానికి తైవాన్కు చెందిన రెచీ సంస్థ భాగస్వామ్యంతో డైకిన్ ఏర్పాటు చేస్తున్న నూతన తయారీ కేంద్రం, దేశంలో ఏసీ తయారీ హబ్ గా ఎదగాలన్న శ్రీసిటీ లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తోందన్నారు. మంచి పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను పెంపొందించాలన్న శ్రీసిటీ దృష్టికి సరితూగేలా సాంకేతిక, స్థానిక అభివృద్ధి ప్రాధాన్యతతో డైకిన్ పయనిస్తోందని





# రక్తహీనత రహిత ఆంధ్రప్రదేశ్ మన ధ్యేయం



**గుడిబండ స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**

అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంను గర్భవతులు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ గంగరత్నమ్మ అన్నారు. మండల పరిధిలోని మోరుబాగల్ మండల ప్రాథమిక పాఠశాల లో పౌష్టికాహార పక్షోత్సవాలను గురువారం కిషోర్ బాలికలకు ఐ సి డి ఎస్, వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు ప్రతినెల వైద్యుని సలహాలను తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గర్భవతి అయింది మొదలు పౌష్టికాహారమైన ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి ఆహారమును ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. బలమైన ఆహారం తీసుకుంటే జన్మించే శిశువు ఆరోగ్యంగా పుడతాడని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించాలని కోరారు. రక్తహీనత రహిత ఆంధ్రప్రదేశ్ ధ్యేయంగా రక్త హీనత పై అవగాహన నిర్వహిచారు. పాఠశాలలోని బాలలకు ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ కమలమ్మ మాట్లాడుతూ పోషక విలువలతో కూడినటువంటి చిరుధాన్యాలు ఉపయోగించడం వల్ల మనుషులు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కలిగించారు. హిమోగ్లోబిన్ శాతం 12 నుండి 14 శాతం వరకు ఉండాలని తెలిపారు.ఎ ఎన్ ఎం రేవతి హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న పిల్లలకు హిమోగ్లోబిన్ శాతం పెరగడానికి తగు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు అమ్మజక్క మాట్లాడుతూ ఉత్తమ పౌష్టికాహారం తీసుకోవడంతో వివిధ వ్యాధుల నుండి రక్షణే కాక పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి డి పి ఓ గంగరత్నమ్మ, సూపర్వైజర్ కమలమ్మ, డాక్టర్ భారతి, ఏఎన్ఎం రేవతి, ప్రధానోపాధ్యాయులు అమ్మజక్క తో పాటు ఉపాధ్యాయులు, మోరుబాగల్ సెక్టర్ అంగన్వాడీ సిబ్బంది ,ఆశా కార్యకర్తలు, గర్భిణీ మహిళలు, మాజీ ఎంపీటీసీ మంజమ్మ రాజేంద్ర, డీలర్ పురుషోత్తం పాల్గొన్నారు.

# సింహపురి వైద్య సేవాసమితి ఆధ్వర్యంలో సాయం బడి



**నెల్లూరు స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**

సింహపురి వైద్య సేవ సమితి సహకారంతో జయభారత్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో చంద్రమౌళి నగర్ గిరిజన సంఘంలో గిరిజన బాలబాలికలకు సాయం బడి నిర్వహిస్తున్నారు. వీరికి యానాదిస్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు ద్వారా విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు పెన్సిళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ పర్యవేక్షకులు వెంకటలక్ష్మి టీచర్ విద్యావతి ఉన్నారు

# ఈ స్కానర్ ద్వారా గంజాయి అమ్మకాలకు చెక్....ఎస్ ఐ పరుశురా ముడు



**బైరెడ్డిపల్లి స్వర్ణసాగరం ఏప్రిల్16:-**

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో ని కొన్ని బహిరంగ ప్రదేశాలు, నిత్యం జన సమూహం గుమి కూడే ప్రాంతాలైన కూడళ్లలో మరియు సంత, చెక్పోస్ట్ ఏరియా, హై స్కూల్ చుట్టుపక్కల ఏరియా, పాతపేట రోడ్డు, వీకోట రోడ్, మిట్టపల్లి క్రాస్, ఇండియన్ బ్యాంక్ సర్కిల్ మొదలగు ప్రాంతాలలో ఈ స్కానర్ ను ఫిక్స్ చేయడం జరిగింది. పాంప్లెట్ లో ఉన్న స్కానర్ నుస్కాన్ చేసి మీ సెల్ ద్వారా మాకు గంజాయి గురించి సమాచారం అందించగలరని మండల ప్రజలను స్థానిక ఎస్ ఐ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలు మేరకు గంజాయిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు కొన్ని ఆదేశాలు జారీ చేశారు.వీటి మేరకు మేము ,మా సిబ్బంది ఈ స్కానర్ ను ఏర్పాటు చేసాం.. మండల ప్రజలు గమనించి మీ ప్రాంతాల్లో గాను,మీ చుట్టుపక్కల గానీ గంజాయి సాగు,అమ్మకాలు కొనసాగిస్తుంటే వివరాలు తెలియజేయండి.మీ వివరాలు గోప్యంగా ఉంచుతాంని తెలిపారు.ఈ కార్యక్రమంలో రక్షణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామసభలు గ్రామాభివృద్ధికి మూలాలు.

## గ్రామసభలను గ్రామ ప్రజలే జయప్రదం చేయాలి.

**వరదయ్యపాలెం,స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**



గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై గ్రామసభలను జయప్రదం చేయవలసిన అవసరం ఉందని డివిజనల్ విజిలెన్స్ అండ్ మానెటరింగ్ కమిటీ సభ్యుడు,ప్రముఖ సామాజిక కార్యకర్త గుత్తి త్యాగరాజు అన్నారు.గురువారం తన స్వగ్రామం ఇందిరానగర్ లో జరిగిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు.గ్రామసభ జరిగిన తీరు తనను ఆవేదనకు గురించేసిందన్నారు.ఈ సందర్భంగా గుత్తి త్యాగరాజు మాట్లాడుతూగ్రామసభలు అనేవి గ్రామీణ ప్రజాస్వామ్యంలో కీలకమైన భాగాలు. ఇవి గ్రామస్థులకే సంబంధించి,గ్రామ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచే వేదికలు. ప్రజలు ప్రత్యక్షంగా పాలనలో పాల్గొని తమ అభిప్రాయాలు, అవసరాలు వ్యక్తపరచే అవకాశాన్ని గ్రామసభలు కల్పిస్తాయన్నారు.గ్రామసభల ద్వారా ప్రభుత్వ పథకాలు ఎంతమేరకు అమలవుతున్నాయో తెలుసుకోవచ్చని,గ్రామంలో అవసరమైన మౌలిక వసతులు, విద్య,ఆరోగ్యం,నీరు,రహదారులు వంటి అంశాలపై చర్చించవచ్చున్నారు.ఈ విధంగా, గ్రామసభలు గ్రామ అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలుస్తాయన్నారు.అయితే, గ్రామసభలు విజయవంతం కావాలంటే,గ్రామస్థుల చురుకైన పాల్గొనడం అత్యవసరం అన్నారు.గ్రామం లోని ప్రతి ఒక్కరూ పాల్గొని తమ సమస్యలు,సూచనలు తెరపైకి తేవాలన్నారు.పాలకులకు సక్రమమైన సూచనలు ఇవ్వడం ద్వారా, గ్రామాభివృద్ధికి దోహదపడాలన్నారు.గ్రామ సభల పట్ల గ్రామస్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.గ్రామసభలో తీసుకునే నిర్ణయాలు,చారిత్రక నిర్ణయాలు అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామము అభివృద్ధి చెందాలి అంటే గ్రామ సభలో తీసుకునే నిర్ణయాలు కీలకమైనవని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్బంగా కొన్ని ప్రస్తుత సమస్యలను గ్రామసభ ద్రుష్టికి తీసుకొచ్చారు.గత ప్రభుత్వంలో ఇందిరానగర్ గ్రామంలో ఇచ్చిన ఇంటి పట్టాలకు అనువైన స్థలాలు చూపించలేక పోయారని గ్రామ సభలో గుత్తి త్యాగరాజు ప్రస్తావించారు.ఇప్పుడు అయినా సరే ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇప్పించి,అందులో పక్కా ఇళ్ల నిర్మాణం మంజూరు చేయాలని గ్రామసభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.పద్మావతి పురం లోని ట్యాంక్ కు మరమ్మత్తులు చేపట్టాలని,ఇందిరానగర్ పంచాయతీ లోని గోవర్ధనపురంకు త్రాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని,ఇక్కడి పాడి రైతులకు పశువులు ఉండడం చేత వాటికి కూడా మంచినీటి సౌకర్యం ఏర్పాటు,పద్మావతిపురం నందు అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, పద్మావతి పురం,ఇందిరానగర్ ఎస్ టి కాలనీ ,రాజీవ్ నగర్,నందు సీసీ రోడ్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని గుత్తి త్యాగరాజు గ్రామసభ ద్రుష్టికి తీసుకెళ్లారు.గ్రామసభలు సజావుగా, నియమ నిబంధనలుకు లోబడి నిర్వహించడం, గ్రామసభకు ముఖ్య అధికారులు హాజరు కావడం ముఖ్యమని,గ్రామసభలకు సంబంధిత అధికారులు అందరూ హాజరై,ప్రజలు అభిప్రాయంకు విలువలు ఇచ్చినపుడే,గ్రామసభలపై గ్రామ ప్రజలకు నమ్మకం మరియు అవగాహన కలిగి,గ్రా మా భివృద్ధిలో ప్రభుత్వం పనితీరు ప్రజలకు అర్థం అవుతుం దని గుత్తి త్యాగరాజు అన్నారు.విధి నిర్వహణలో అధికారులు బదిలీలపై వస్తుంటారు- పోతుంటారు.గ్రామ ప్రజలు ఇక్కడే ఉంటారు కాబట్టి ఇక్కడి సమస్యలు పరిష్కారం కొఅకు,గ్రామాభివృద్ధిపై గ్రామస్థులే ప్రత్యేక ద్రుష్టి పెట్టాలని హితవు పలికారు.

# ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం ర్యాలీ



**వరదయ్య పాలెం స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**

వరదయ్యపాలెం మండలంలోని పెద్దపాండూరు సచివాలయం కి చెందిన పాండూరు హెచ్ డబ్ల్యు అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చిరుధాన్యాల గురించి వాటినుండి అందే పోషణ గురించి గర్భిణీ బాలింతలు మహిళలకు యుక్త వయసు బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్లు బజావతి,శిల్పలి మాట్లాడుతూ అంగన్వాడి పరిధిలోగల మహిళలకు చిరుధాన్యాలు వల్ల అందే పోషక విలువలను తెలియజేయడం జరిగింది రాగులు, సజ్జలు, జొన్నలు చిరుధాన్యాలలో ఐరన్,పిండి పదార్థాలు అధికంగా లభిస్తాయని తెలియజేశారు. చిరుధాన్యాలు తప్పనిసరిగా మహిళలందరూ స్వీకరించాలని ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు.అన్ని అంగన్వాడి కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమాలు జరుగుతున్నాయి. గర్భిణీగా ఉన్నప్పటి నుండి బిడ్డ పుట్టి రెండు సంవత్సరాలు నిండే వరకు సంరక్షణ పట్ల గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపాండూరు సచివాలయం సంబంధించిన అంగన్వాడీ టీచర్లు , తదుపరులు పాల్గొన్నారు.

# పూతలపట్టు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి బాట లో నడిపిద్దాం



**పూతలపట్టు స్వర్ణ సాగరం ఏప్రిల్ 17**

పూతలపట్టు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి బాటలో నడిపిద్దామని ఎంపీడీవో నాగరాజు అన్నారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సాధారణ సర్వసభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సర్వసభ సమావేశము అధ్యక్షత మండల ఎంపీపీ కుమారి వహించారు అనంతరం ఈ సందర్భంగా ఎంపీడీవో నాగరాజు మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు అందరు సహకరించి అభివృద్ధి బాటలో నడిపిద్దామని సూచించారు అదేవిధంగా కొత్తకోట సర్పంచి పద్మజ రాణి మాట్లాడుతూ కొత్తకోట గ్రామపంచాయతీ నందు భూ సమస్యలు ఎక్కువగా ఉన్నందున సమస్యలు పరిష్కరించాలని తాసిల్దార్ రమేష్ బాబు కోరారు అదేవిధంగా బైటపల్లి సర్పంచ్ రామ్ తులసి మాట్లాడుతూ జేఎల్వోలు మాకు అందుబాటులో లేనందున వీధిలైట్లు మరమ్మత్తులు ఎలా చేయాలని మేము చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు వెంటనే మా గ్రామ పంచాయతీకి జేఎల్వో ను అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు అదేవిధంగా పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సి హెచ్ ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ పూతలపట్టు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు లేక .సిబ్బందులు కొరత ఉన్నందున చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం మాకు డాక్టర్లను మంజూరు చేయవలసిందిగా ఎంపీడీవో దృష్టికి తేవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుమారి జడ్పిటిసి దేవిక వైస్ ఎంపీపీలు ద్వారకనాథ్ రెడ్డి. మురళి. సిఐ కృష్ణమోహన్ అన్ని శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఎంపిటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# పంచాయతీ రాజ్ వ్యవస్థ బలంగా ఉండాలంటే, జిల్లా పరిషత్తులు పరిపుష్టిగా ఉండాలి.!

## 16 వ ఆర్థిక సంఘం సమావేశంలో సత్యవేడు జడ్పీటీసీ.

**స్వర్ణ సాగరం సత్యవేడు**





తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 16 వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్. అరవింద్ పనగారియా ఐఏఎస్ అధ్యక్షతన నిర్వహించిన 16 వ ఆర్థిక సంఘ సమావేశానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జిల్లా పరిషత్ సభ్యుల తరపున సత్యవేడు జెడ్పీటీసి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలు మరియు పంచాయతీరాజ్ సంస్థలు అభివృద్ధి సాధించాలంటే జిల్లా పరిషత్తులు బలంగా ఉండాలని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డా. అరవింద్ పనగారియను కోరారు, అలాగే జిల్లా పరిషత్తులకు స్వయం సమృద్ధి నిధులు సమకూరేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మరియు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజాను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జిల్లా పరిషత్తుల తరఫున సత్యవేడు జడ్పీటీసి సభ్యులు విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి విన్నవించారు. ఈ ప్రతిపాదనకు 16వ ఆర్థిక సంఘం సభ్యులు అన్నీజార్జ్ మాద్యూ మరియు అజయ్ నారాయణ్ జాహులు మద్దతు పలికి అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ సుభాం భంసాల్ మరియు ఉమ్మడి చిత్తూరు జిల్లా సిఇఓ రవికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# చిరంజీవి, బాలకృష్ణతో ఇక సినిమాలు చేయను

స్టార్ హీరోల సరసన కథానాయికగా నటిస్తూనే అడపాదడపా లేడి ఓరియెంటెడ్ చిత్రాలలో నటించి లేడి సూపర్ స్టార్‌గా పేరు తెచ్చుకుంది విజయశాంతి. అప్పట్లో స్టార్ హీరోలందరి సరసన నటించి స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. యాక్షన్ సినిమాలకి కేరాఫ్ అడ్రెస్‌గా కూడా మారింది. తెరపై ఖాకీ పాత్రలకే వన్నె తీసుకొచ్చిన విజయశాంతి యాక్షన్ సన్నివేశాల కోసం ఎలాండి డూప్ లేకుండా నటించేవారు. ఆమె వయసు 60కి సమీపిస్తున్నా కూడా అడపాదడపా సినిమాలలో నటిస్తూ మెప్పిస్తుంది. ఆ మధ్య మహేష్ బాబుతో సరిలేరు నీకెవ్వరు చిత్రంలో నటించిన విజయశాంతి ఇప్పుడు అర్జున్ సన్నాఫ్ వైజయంతి చిత్రంలో నటించింది. కల్యాణ్ రామ్ హీరోగా నటించిన ఈ చిత్రం ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే విజయశాంతి తన కెరీర్‌లో ఎక్కువగా మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణలతో కలిసి నటించింది. వీరి కాంబోలో వచ్చిన చాలా చిత్రాలు సూపర్ హిట్‌గా కూడా నిలిచాయి. అయితే ఇప్పుడు తిరిగి బాలకృష్ణ, చిరంజీవిలతో కలిసి నటించే ఛాన్స్ ఉందా అనే ప్రశ్న విజయశాంతికి ఎదురు కాగా, ఇకపై తాను వారితో సినిమాలు చేయనని సంచలన స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఎమ్మెల్సీగా ఎంపికైన నేపథ్యంలో బాధ్యతలు పెరిగాయి. ప్రజా కార్యక్రమాలతో బిజీగా ఉంటాం కాబట్టి మున్ముందు సినిమాలు చేసే అవకాశం ఉండదు. ఇక చిరంజీవి,బాలకృష్ణలతో నటించే అవకాశమే లేదు అని తేల్చేసింది లేడి సూపర్ స్టార్. విజయశాంతి.. చిరంజీవి కాంబోలో వచ్చిన గ్యాంగ్ లీడర్, యముడికి మొగుడు, స్వయం ఖుషి, పసివాడి ప్రాణం, కొండవీటి దొంగ, కొండవీటి రాజా, మెకానిక్ అల్లుడు, అత్తకు యముడు అమ్మాయికి మొగుడు, మహానగరంలో మాయగాడు, స్టూవర్ట్ పురం పోలీస్ స్టేషన్, రుద్రవీణ, మంచి దొంగ, సంఘర్షణ, దేవాంతకుడు, చాణక్య శపథం, యుద్ధభూమి, ధైర్యవంతుడు, ఛాలెంజ్, చిరంజీవి, ధర్మయుద్ధం చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. ఇక విజయశాంతి.. బాలయ్య కాంబోలో రౌడీ ఇన్స్‌పెక్టర్, లారీ డ్రైవర్, ముద్దుల మావయ్య, నిప్పురవ్వ, భార్గవ రాముడు, మువ్వ గోపాలుడు, అపూర్వ సహోదరులు, ముద్దుల కృష్ణయ్య, సాహస సామ్రాట్, భానుమతి గారి మొగుడు, ముద్దుల మేనల్లుడు, భలే దొంగ, ఇన్స్ పెక్టర్ ప్రతాప్, తల్లి తండ్రులు, దేశోద్ధారకుడు, పట్టాభిషేకం, రౌడీ రాణి, కథానాయకుడు, సంఘర్ష్ వంటి సినిమాలు రాగా, ఇందులో చాలా చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. మున్ముందు తాను సినిమాలు చేయనని విజయశాంతి స్టేట్ మెంట్ ఇవ్వడంతో అర్జున్ సన్నాఫ్ వైజయంతి చిత్రమే విజయశాంతికి చివరి చిత్రం అవుతుందా అనేది చూడాలి.

# రెడ్ - వైట్ డ్రెస్‌లో బీచ్‌లో పిచ్చెక్కిస్తున్న కేట్ శర్మ..





# డబ్బులు అవసరం అంటే డైరెక్ట్‌గా అడుగుతా మంచు లక్ష్మీ ట్వీట్

టాలీవుడ్ నటి, మోహన్ బాబు కూతురు మంచు లక్ష్మీ సోషల్ మీడియా ఖాతా హ్యాకింగ్ గురైంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పోస్ట్ వాటిని ఎవరూ నమ్మవద్దని అభిమానులను, సన్నిహితులను కోరింది. తనకు డబ్బులు అవసరమైతే డైరెక్ట్‌గా అడుగుతానని తెలిపింది. సోషల్ మీడియాలో ఎవరినీ నేను డబ్బులు అడగనని ట్వీట్ చేసింది. ఇలాంటి వాటి పట్ల దయచేసి అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరింది. ఈ విషయాన్ని ట్విటర్ ద్వారా వెల్లడించింది. కాగా.. మంచు లక్ష్మీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీకి సంబంధించిన పోస్టులు ప్రత్యక్షమయ్యాయి. దీంతో అప్రమత్తమైన మంచు లక్ష్మీ వెంటనే ట్విటర్ ద్వారా అభిమానులను, సన్నిహితులను అలర్ట్ చేస్తూ ట్వీట్ చేసింది. కాగా.. మంచు లక్ష్మీ ఇటీవలే హైదరాబాద్‌లో గ్రాండ్ ఫ్యాషన్ షో నిర్వహించింది. టీచ్ ఫర్ ఛేంజ్ పేరిట నిర్వహించిన ఈ ఈవెంట్‌లో పలువురు టాలీవుడ్ సినీతారలు హాజరైన సందడి చేశారు. ఆమె తమ్ముడు మంచు మనోజ్ సైతం ఈవెంట్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరలైన సంగతి తెలిసిందే.



# వింటేజ్ కనెక్టివిటీతో అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రం 'మధురం'

ఆచార్య, ఆర్ఆర్ఆర్ వంటి పలు క్రేజీ చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి 'మధురం' చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నాడు ఉదయ్ రాజ్. రాజేష్ చికిలే దర్శకత్వంలో వస్తున్న మధురం సినిమాలో వైష్ణవి సింగ్ హీరోయిన్‌గా నటించింది. శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌టైన్మెంట్‌బ్యానర్‌పై యం.బంగార్రాజు నిర్మించారు. 'ఎ మెమొరబుల్ లవ్' ట్యాగ్‌లైన్‌తో టీనేజ్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ చిత్రం ఏప్రిల్ 18న శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో ఉదయ్ రాజ్ చిత్ర విశేషాలు పంచుకున్నారు. "చిన్నప్పట్నుంచీ చిరంజీవిపై ఇష్టం ఉండేది. ఆయన స్ఫూర్తితో సినిమాల్లోకి వచ్చాను. తర్వాత 'ఆచార్య' షూటింగ్ టైమ్‌లో చిరంజీవితో మాట్లాడటం గ్రేట్ ఎక్స్‌పీరియెన్స్. 12 ఏళ్లగా ఇండస్ట్రీలో ఉన్నా. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్‌గా వర్క్ చేశా. చాలా సినిమాల్లో బ్యాక్‌గ్రౌండ్ ఆర్టిస్ట్‌గా నటించాను. బంగార్రాజు సపోర్ట్‌తో 'మధురం' చిత్రంలో హీరోగా మారా. దర్శకుడు రాజేష్ చికిలేతో నాకు ఎప్పట్నుంచో పరిచయం ఉంది. ఆయన ఈ కథ చెప్పినప్పుడు చాలా ఎక్సయిట్ అయ్యాను. నైంటీస్ బ్యాక్‌డ్రాప్ స్టోరీ ఇది. పదవ తరగతి అమ్మాయి, తొమ్మిదో తరగతి అబ్బాయి మధ్య నడిచే ప్రేమకథ చాలా అందంగా ఉంటుంది. ఇందులో మూడు డిఫరెంట్ వేరియేషన్స్‌లో కనిపిస్తాను. చిన్న పిల్లాడిగా, స్కూల్ స్టూడెంట్‌గా, మిడిల్ ఏజ్ వ్యక్తిగా మూడు గెటప్స్ వేయడానికి చాలా కష్టపడ్డా. కొన్ని సీన్లలో కొంచెం చబ్బీగా కనిపిస్తా. మళ్లీ సన్నగా అవడం కోసం ఫుడ్ తినడం మానేసి కొన్ని రోజులు కేవలం నీళ్లు మాత్రమే తాగాను." అని ఉదయ్ రాజ్ తెలిపాడు. " డైరెక్టర్, నేను చదువుకుంది జెడ్‌పీహెచ్ స్కూల్‌లోనే కావడంతో అప్పటి విశేషాలను గుర్తు చేసేలా ఈ చిత్రాన్ని రూపొందించాం. నైంటీస్‌లో స్కూల్స్ ఎలా ఉండేవి, అప్పటి పిల్లలు ఎలా బిహేవ్ చేశారనే వాటిపై కొన్ని రీసెర్చ్‌లు చేశాం. స్కూల్‌కి సైకిల్ వేసుకెళ్లి.. అమ్మాయి ముందు బ్రేక్ కొట్టడం, చేతులు వదిలేసి తొక్కడం లాంటి సీన్లతో పాటు విలేజ్ నేటివిటీ, వింటేజ్ సన్నివేశాలు అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటాయి. 90ల జనరేషన్‌కు పాత విషయాలను గుర్తుచేసేలా సినిమా ఉంటుంది. ఇందులో కథే హీరో అని భావిస్తారు. షూటింగ్ అంతా లైవ్ లొకేషన్‌లో చేశాం. హీరోయిన్‌గా తెలుగమ్మాయిని తీసుకోవాలనుకున్నా.. కొన్ని ప్రయత్నాలుచేశాం కానీ కుదరలేదు. అయితే వైష్ణవి సింగ్ మాత్రం చాలా బాగా పెర్ఫార్మ్ చేసింది. మధు, రామ్‌ల ప్రేమాయణమే ఈ మధురం చిత్రం. దర్శకుడు రాజేష్ చికిలే ఈ కథను చాలా అందంగా తీర్చిదిద్దారు." అని పేర్కొన్నాడు. " నాకు ఏదీ అంత ఈజీగా రాలేదు. చాలా కష్టపడితే కానీ అవకాశాలు వచ్చాయి. ఈ సినిమా విషయంలోనూ కొన్ని సమస్యలు ఫేస్ చేశాను. కానీ నిర్మాత బంగార్రాజు అన్ని విషయాల్లో సపోర్ట్‌గా నిలిచి నాకు ధైర్యాన్ని ఇచ్చారు.